అన్నదాతపై బీమా భారం

- రైతులే ప్రీమియం చెల్లించాలంటున్న అధికారులు
- సగం మంది రైతులు కూడా చెల్లించని వైనం
- గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వమే చెల్లింపు


నారు తీస్తున్న కూలీలు

ఆగిరిపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉచిత పంటల బీమాకు రైతులే ప్రీమియం చెల్లించాలని కూటమి ప్రభుత్వం పెట్టిన నిబంధన రైతులకు భారంగా మారింది. ఓ వైపు రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే, ప్రభుత్వం తమను ఏ మాత్రం ప్రోత్సహించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి తమకు ఒక్క పైసా ఖర్చు కాకుండా ఉచితంగా పంటల బీమా అందించిందని అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు.

ప్రీమియం చెల్లింపు ఇలా..

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సుమారు 5,800 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో బీమా ప్రీమియం చెల్లింపునకు ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎకరాకు రూ.840 చెల్లించాలని, ఆగస్టు 15 వరకు గడువు విధించింది. రైతులే స్వయంగా పంటల వారీగా ప్రీమియం చెల్లించాలని పేర్కొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా రైతులపై భారం లేకుండా, ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండానే పంటల బీమా అమలు చేసింది.

ప్రస్తుత ప్రభుత్వంలో రైతులపైనే భారం

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీమా ప్రీమియం భారం రైతులపై పడింది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి పంటలు సాగు చేసే ప్రతి రైతు పంటల బీమా పొందాలంటే ప్రీమియం చెల్లించాల్సిందే. ప్రభుత్వ సాయం అందక పెట్టుబడులకు అప్పులు చేసిన రైతులు ప్రీమియం కూడా చెల్లించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం రైతుల అకౌంట్‌లో ఎప్పుడు పడుతుందో స్పష్టత లేదు. ఇలాంటి సమయంలో ప్రీమియం చెల్లించడం కష్టంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. సమయం తక్కువగా ఉండడం, ప్రీమియాన్ని రైతులే చెల్లించాల్సి రావడంతో చాలా మంది బీమా నమోదు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు 31 మంది రైతులు మాత్రమే పంటల బీమాకు ప్రీమియం చెల్లించారు.

రైతులకు అండగా నిలిచిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకునే దిశగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకువచ్చింది. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగా ఉచిత పంటల బీమాను అమలు చేశారు. రైతులు సాగు చేసే మొత్తం విస్తీర్ణానికి చెల్లించవలసిన ప్రీమియాన్ని ప్రభుత్వమే కట్టేలా చర్యలు తీసుకున్నారు. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంటలకు నష్టం వాటిల్లిన సందర్భంలో పూర్తిగా నష్ట పరిహారం అందుకునే వారమని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. కౌలు రైతులకు పరిహారాన్ని అందించినట్లు చెబుతున్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా తమ ఖాతాలకు నగదు జమ చేసే వారని రైతులు చెబుతున్నారు.



ఉచిత బీమా కొనసాగించాలి

ఉచిత పంటల బీమా రద్దు చేయడం అన్యాయం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత బీమాను కొనసాగించి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. వ్యవసాయం చేయడం కష్టంగా మారిన పరిస్థితుల్లో ప్రీమియం భారాన్ని రైతులే భరించాలనడం సరికాదు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

–పల్లగాని నరసింహారావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు



ప్రభుత్వమే చెల్లించాలి

గతంలో అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకం మాలాంటి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పెట్టుబడికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే, బీమా ప్రీమియం భారం రైతులపై వేయడం సమంజసం కాదు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేయాలి.

- కుప్పాల నాగరాజు, రైతు, వడ్లమాను



గత ప్రభుత్వంలో ఒక్క రూపాయి కట్టలేదు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పంటల బీమా ప్రీమియం ఒక్క రూపాయి కూడా కట్టలేదు. అంతా ప్రభుత్వమే చెల్లించేది. నాకు రెండు ఎకరాల పొలం ఉంది. వరి సాగుకు సిద్ధమవుతున్నా. అధికారులు పంట బీమా ప్రీమియం చెల్లించమంటున్నారు. లేదంటే పరిహారం రాదంటున్నారు. ఇది రైతుకు ఆర్థిక భారమే. ప్రభుత్వం స్పందించి ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలి.

- చిమట శ్రీనివాసరావు, రైతు, ఆగిరిపల్లి



ప్రీమియం చెల్లించిన వారికే బీమా

పంటల బీమా పథకానికి సంబంధించి ప్రీమియం చెల్లించిన వారికే బీమా వర్తిస్తుంది. మండలంలో వరి పండించే రైతులకు ఆగస్టు 15 వరకు ప్రీమియం చెల్లించడానికి గడువు ఉంది. మండలంలో ఇప్పటివరకు సగం మంది రైతులు కూడా చెల్లించలేదు. అర్హులైన రైతులు వెంటనే బీమా ప్రీమియం చెల్లించాలి.

- భవాని, ఆగిరిపల్లి, మండల వ్యవసాయాధికారి

మామిడిలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

ఏలూరు జిల్లా ఉద్యాన అధికారి ఎస్.రామ్మోహన్


మామిడి తోటలో కొమ్మ కత్తిరింపులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాధారాణి

నూజివీడు: మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏలూరు జిల్లా ఉద్యాన అధికారి ఎస్.రామ్మోహన్ అన్నారు. ప్రపంచ మామిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మామిడి పరిశోధన స్థానంలో ప్రిన్సిపాల్ సైంటిస్టు బొర్రా కనక మహాలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడిలో కొమ్మ కత్తిరింపులు, ఎరువుల యాజమాన్యానికి ఒక హెక్టారుకు రూ.20 వేల రాయితీ అందజేస్తున్నారని చెప్పారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో ఇద్దరు, ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి వారి ద్వారా శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మామిడి ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనక మహాలక్ష్మి మాట్లాడుతూ రైతులు మామిడి తోటలకు సూటి ఎరువులు వేసుకోవాలన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త కె.రాధారాణి కొమ్మ కత్తిరింపులు, కలుపు యాజమాన్యం, ఎరువులు, నీటి యాజమాన్యం, పూత రావడానికి తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కీటక విభాగం శాస్త్రవేత్త జి.శాలిరాజు మాట్లాడారు. అనంతరం కొమ్మ కత్తిరింపులు ఎలా చేయాలి, డ్రోన్ ద్వారా రసాయన మందుల పిచికారీపై ప్రదర్శన నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, ఉద్యాన అధికారులు, ఉద్యాన సహాయకులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

మారెమ్మ హుండీ ఆదాయం రూ. 14.72 లక్షలు

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం లెక్కించగా రూ.14,72,120 లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి. ప్రసాద్ తెలిపారు. అలాగే విస్సన్నపేటలోని గంగా పార్వతి సమేత చంద్రశేఖర స్వామి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించగా రూ.2,68,913 ఆదాయం వచ్చిందని చెప్పారు.

చికిత్సతో క్షయ వ్యాధి నివారణ

కాకర్ల(తిరువూరురూరల్): క్షయవ్యాధి గ్రస్తులను గుర్తించి సకాలంలో వైద్యసేవలందించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని జిల్లా లెప్రసీ కంట్రోల్, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ భాను నాయక్ అన్నారు. చౌటపల్లి పీహెచ్‌సీని, దాని పరిధిలోని కాకర్ల ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యులకు పలు సూచనలిచ్చారు. చౌటపల్లి పీహెచ్‌సీ పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులకు చేస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులు పాల్గొన్నారు.

బీటలు వారుతున్న పురాతన కట్టడం



నూజివీడు: పట్టణంలోని పురాతన కట్టడమైన కుక్కల గేటు నెర్రెలిస్తోంది. నూజివీడు ప్రాంతాన్ని పాలించిన జమీందారులు నిర్మించిన ఈ పురాతన కట్టడంపై పిచ్చి మొక్కలు మొలిచి అవి పెరిగి పెద్దవి అయ్యి కుక్కలగేటు గోడలు బీటలు వారుతున్నాయి. పురాతన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులపైన, ప్రజాప్రతినిధులపైన ఉన్నప్పటికీ వారెవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. నూజివీడు చరిత్రను చాటి చెప్పే పురాతన కట్టడంపై ఇంత నిర్లక్ష్యధోరణి ఎంతమాత్రం సమంజసం కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గతంలో పనిచేసిన డీఎస్పీ బుక్కాపురం శ్రీనివాసులు నాలుగేళ్ల కిందట కుక్కల గేటుతో పాటు, గుర్రం గేటులకు రంగులు వేయించి వాటిని తీర్చిదిద్దారు. చరిత్రను చాటి చెప్పే కట్టడాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల గేటును పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిధుల కేటాయింపులో వివక్ష


కౌన్సిల్ సమావేశంలో టీడీపీ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

- నగర పంచాయతీ కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీ ఆందోళన
- రసాభాసగా తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు పట్టణాభివృద్ధికై బీపీఎస్, ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.2.50 కోట్లను ఏకపక్షంగా టీడీపీ కౌన్సిలర్ల వార్డులకే కేటాయించడంపై మంగళవారం జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఆందోళనకు దిగారు. సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించకుండా అధికార పార్టీ కౌన్సిలర్లకు లబ్ధి చేకూర్చడమే అజెండాగా తీసుకోవడంపై అభ్యంతరం తెలిపారు. ఏకపక్ష ధోరణితో సాగుతున్న కౌన్సిల్ సమావేశంలో తమను పిలిచి అవమానించారంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, గుమ్మా వెంకటేశ్వరి, పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, షేక్ నదియా ఆగ్రహం వ్యక్తంచేశారు. నగర పంచాయతీ నిధులను ఇష్టారాజ్యంగా కేటాయించడం తగదని, అన్ని వార్డుల్లోనూ సమస్యలు గుర్తించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మేము అధికారంలో ఉన్నామని, మా వార్డుల్లోనే నిధులు కేటాయించుకుంటామని, మీ చేతనైంది చేసుకోండంటూ టీడీపీ కౌన్సిలర్లు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లతో వాగ్వివాదానికి దిగారు. నగర పంచాయతీ సమావేశాన్ని తాము బహిష్కరిస్తున్నామని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ప్రకటించి కౌన్సిల్ హాల్ నుంచి వచ్చేశారు.

ఆశాజనకంగా లేని కార్మికుల వేతనాల పెంపు

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె


కొండపల్లిలో పదో రోజు సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు గ్రేడ్ల వారీగా పెంచిన వేతనాలు ఆశాజనకంగా లేవని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ అన్నారు. కొండపల్లిలో పదో రోజు కార్మికుల సమ్మె మంగళవారం కొనసాగించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల 9 రోజుల సమ్మె కారణంగా ప్రభుత్వం జీఓ 124 ప్రకారం వేతనాలు అరకొరగా పెంచిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం తగదని చెప్పారు. రిటైర్‌మెంట్ పెంపు అంశం ప్రస్తావన లేదన్నారు. జీఓ 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. వేతనాల పెంపుతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు మంగళవారం తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్ రెడ్డి అభినందించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ఏఓ పద్మ

వామకుంట్ల(తిరువూరురూరల్): పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని రైతులు తగ్గించాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. వామకుంట్లలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సస్యరక్షణలో జీవన ఎరువుల ఆవశ్యకతను వివరించారు. నానో డీఏపీ, నానో యూరియా వినియోగం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఖరీఫ్ సాగు చేసే రైతులు తప్పక ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు. తిరువూరు తహసీల్దార్ ఉదయ భాస్కర్ కౌలు రైతు గుర్తింపు కార్డుల నమోదును వివరించారు. ఎంపీడీఓ రవి బాబు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన..

చాట్రాయి: వరి పంటలో యాజమాన్య పద్ధతులపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. చనుబండ గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి పైరుకు సూర్యరశ్మి తగిలేలా ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పులో కాలిబాటలు వేసుకోవాలని, మొక్కకు మొక్కకు దూరం ఉండడం వలన గాలి, వెలుతురు తగులుతుందని చెప్పారు. దీన వలన చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో రైతులు చేరాలని ఆయన సూచించారు.

- **తెల్లదేవరపల్లి(విస్సన్నపేట):** తెల్లదేవరపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంనిర్వహించారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ చేకు చినరాట్నాలు పాల్గొని రైతుల పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఓ ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.
- **జి.కొండూరు:** రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులను పొందవచ్చని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కోడూరు, కుంటముక్కల గ్రామాల్లో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓ రామకృష్ణనాయక్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి కేసీహెచ్ సూరిబాబు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.
- **దాములూరు(ఇబ్రహీంపట్నం):** ఖరీఫ్ సీజన్‌లో రైతులు సేంద్రియ, నానో ఎరువులు వినియోగించాలని తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. దాములూరు, కాచవరం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఎడవల్లి రజిని అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ పొలాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. దాములూరు సర్పంచి మధుసూదనరావు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్య శిబిరాలు వరం

నూజివీడు: పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు వరమని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని మహోన్నతుని ప్రార్థనా మందిరంలో డివిజన్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్‌లోని దైవసేవకులకు ఉచిత వైద్య శిబిరం జరిగింది. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గుడివాడలోని సురక్ష మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు జగదీష్, భరత్, రేఖ వైద్య సేవలు అందించారు. పాస్టర్ రెవ.కేటీ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లలో జాగ్రత్తలు పాటించాలి

ఆగిరిపల్లి: వరి నాట్లు వేసే ముందు రైతులు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి జె.భవాని అన్నారు. మంగళవారం కొత్త ఈదరలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు చేశారు.

ముగిసిన మున్సిపల్ కార్మికుల సమ్మె

నూజివీడు: గత తొమ్మిది రోజులుగా తమ డిమాండ్ల సాధనకు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మెను మంగళవారం విరమించారు. ప్రభుత్వం కార్మికులకు చెందిన పలు డిమాండ్లను పరిష్కరించేందుకు సానుకూలంగా స్పందించడం, వేతనం పెంపునకు అంగీకరించడంతో సమ్మెను విరమిస్తున్నట్లు సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి. రాజు పేర్కొన్నారు. నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియో థెరపీ

ముసునూరు: దివ్యాగుల ప్రగతికి అందరి తోడ్పాటు అవసరమని హెచ్ఎం పి.భాస్కరరావు అన్నారు.దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగులకు ఫిజియో థెరపీ చేశారు.

బాలికల్లో డ్రాపవుట్స్‌ను నియంత్రించాలి

ముసునూరు: పాఠశాల విద్యలో బాలికల డ్రాపవుట్లను నియంత్రించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ విజయకుమారి ఆధ్వర్యంలో ముసునూరులోని జెడ్పీ హైస్కూల్, బాలికల గురుకులంలో బాలికల డ్రాపవుట్ల నిర్ధారణకు మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి పలు సూచనలు చేశారు.

బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులకు సన్మానం

చాట్రాయి: మండలంలోని జనార్దనవరం గ్రామ సచివాలయానికి చెందిన సిబ్బంది వేరే మండలాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శి హనుమంతరావు, సిబ్బందిని గ్రామానికి చెందిన మాదాసు చిన్న పుల్లయ్య సన్మానించారు.

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల అసంతృప్తి



కోకిలంపాడు(తిరువూరురూరల్): మండలంలోని కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించిందని విద్యార్థులు మంగళవారం పాఠశాలను సందర్శించిన వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకుల ఎదుట వాపోయారు. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు మానికల రాము, తిరువూరు మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు పట్టెం శివకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండలరావు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం, కూరలు సరిగా ఉడకడం లేదని, సాంబారులో ఎక్కువగా నీరు పోస్తున్నారని, గుడ్లు వాసన వస్తున్నాయని, రాగి జావలో పురుగులు రావడంతో తినలేకపోతున్నామని విద్యార్థులు వారికి తెలిపారు. చిక్కీలో బూజు వస్తుండటంతో బయట పారేస్తున్నామన్నారు. ఈ విషయాలను అధికారుల దృష్టికి తీసుకువెళతామని విద్యార్థి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

బెజవాడ కనకదుర్గమ్మకు ఆషాఢం సారె సమర్పణ



ముసునూరు: చిల్లబోయినపల్లికి చెందిన పలువురు మహిళా భక్తులు మంగళవారం బెజవాడ కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. ప్రత్యేక పూజలతో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత అచ్యుతానందన్‌కు నివాళి




మైలవరం: సీపీఎం అగ్రనేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ చిత్రపటానికి మైలవరం సీపీఎం కార్యాలయంలో మంగళవారం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. సీపీఎం నాయకులు సీహెచ్ సుధాకర్, వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, కోట సురేష్, ముఠా కార్మికులు , ఆటో కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి హీల్ అవయవ కేంద్రంలో 13 మంది దివ్యాంగులకు మంగళవారం కృత్రిమ కాళ్లను అందజేశారు. విజయవాడకు చెందిన ఎస్‌బీఐ పెన్షనర్ల క్లబ్ వారి ఆర్థిక సాయంతో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. ఇప్పటివరకు ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ వారి ఆర్థిక సాయంతో 21 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అమర్చామని హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ తెలిపారు. ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్.రామకృష్ణ, కేఆర్ లక్ష్మీపతిరావు, ఎంఎస్ దీక్షితులు, జి.కృష్ణమూర్తి, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ



ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెం ప్రైమరీ పాఠశాలకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇమేజ్ ఆధ్వర్యంలో నాలుగు బెంచీలను వితరణగా అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని చూడామణి తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్ అభినందించారు. ఇమేజ్ లయన్స్ మల్టీ సర్వీస్ ట్రస్ట్ ప్రెసిడెంట్ వి.శశిధర్, ట్రస్ట్ ట్రెజరర్ శ్రీనివాసాచార్యులు, ఉపాధ్యాయులు వేణు, చౌటుపల్లి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

ఆగిరిపల్లి: సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అడవినెక్కలం గ్రామంలోని డ్రెయినేజీల్లో మురుగును తొలగించి దోమల మందు పిచికారీ చేయించారు. అడవినెక్కలం సర్పంచ్ వేము రాజు పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ నేతలకు ప్రతాప్ పరామర్శ



ఆగిరిపల్లి: మండలంలోని నూగొండపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి శివశంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం శివశంకర్ గృహాన్ని సందర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, సర్పంచులు కందుల విక్రమ్, జాల భూషణం, గుండ్ల హనుమంతరావు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ జెండా ఆమోద దినోత్సవం

తిరువూరు: జాతీయ జెండా ఆమోద దినోత్సవం ఎ.కొండూరు మండలం కోడూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాలోని మూడు రంగుల ప్రాముఖ్యతను, జాతీయ పర్వదినాల్లో పతాకావిష్కరణ చేయాల్సిన ఆవశ్యకతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రదీప్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయి సేవా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆమోద దినోత్సవం నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కాన్వెంట్ల విద్యార్థులు జాతీయ జెండాతో ప్రదర్శన జరిపారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: జాకీర్ హుస్సేన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం గురువారం నిర్వహిస్తామని డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మస్తాన్‌వలి, సాధిక్ మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు.